కనులపండువగా కల్యాణోత్సవాలు


అవనిగడ్డలో కల్యాణం నిర్వహిస్తున్న ఆగమ పండితులు


శ్రీకాకుళంలో గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మ వార్లు


కోడూరులో కల్యాణం నిర్వహిస్తున్న పండితులు, ఉభయదాతలు

- శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించిన అర్చకులు
- భక్తిశ్రద్ధలతో తిలకించిన భక్తులు

అవనిగడ్డ: అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల వ్యాప్తంగా ఉన్న పలు ఆలయాల్లో స్వామి అమ్మ వార్ల కల్యాణోత్సవాలు బుధవారం అర్ధరాత్రి, గురువారం కనులపండువగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు.. బాజాభజంత్రీల మేళతాళాలు.. బాణాసంచా వెలుగులు.. భక్తుల జైజై ధ్వానాల నడుమ అర్చక స్వాములు శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయ దాతలు పాల్గొని కల్యాణాన్ని జరిపించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణోత్సవాలను తిలకించారు. దీంతో ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. అవనిగడ్డలో చారిత్రక ప్రసిద్ధి చెందిన లక్ష్మీనారాయణస్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారిని పెండ్లికొడుకుగా అలంకరించి కల్యాణం జరిపారు. తొలుత నిత్యహోమం నిర్వహించారు. ఆగమ పండితులు దీవి పార్థ వెంకటరామ శ్రీనివాసాచార్యులు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు పర్యవేక్షించారు.

శ్రీకాకుళేశ్వర స్వామివారి కల్యాణం

శ్రీకాకుళం(ఘంటసాల): శ్రీకాకుళంలో వేం చేసి ఉన్న శ్రీరాజ్యలక్ష్మి, భోగలక్ష్మి సమేత శ్రీకాకుళేశ్వర స్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శ్రీకాకుళేశ్వర స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ సహాయ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు కల్యాణాన్ని నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మ వార్లను అశ్వ వాహనంపై ఎదుర్కోలు ఉత్సవం, కల్యాణం అనంతరం అర్ధరాత్రి ఒంటి గంటకు గరుడ వాహనంపై వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఏసీ చక్రధరరావు ప్రత్యేక ఏర్పాట్లను చేయించారు. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


కొక్కిలిగడ్డలో కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

వేణుగోపాలుడి కల్యాణం

కోడూరు: మండలంలోని మందపాకల శివారు పాదాలవారిపాలెం గ్రామంలో వేం చేసి ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి కల్యాణోత్సవాన్ని గురువారం కనులపండువగా నిర్వహించారు. ఉదయం ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేక పల్లకిలో స్వామి, అమ్మవార్లను ఆలయం చుట్టూ ఊరేగించి కల్యాణవేదిక వద్దకు తీసుకువచ్చారు. పండితుడు కాశీభోట్ల శంకరశాస్త్రీ మంత్రవచనాల నడుమ కల్యాణతంతును శాస్త్రోకత్తంగా నిర్వహించగా, కోడూరు వెంకటేశ్వరరావు దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. దేవాదాయ అధికారులు స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. కల్యాణమూర్తులను ప్రత్యేక వాహనంపై ఊరేగించారు. పాదాలవారిపాలెంలో గ్రామోత్సవం జరపగా, ప్రతి ఇంటి వద్ద మహిళలు హారతులు పట్టి భక్తిభావం చాటుకున్నారు. ఈవో సుధాకర్, జేఏ దాసరి గిరిబాబు, గ్రామ ప్రముఖులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


నాగాయలంకలో కల్యాణం చేస్తున్న ధర్మకర్త విశ్వేశ్వరరావు, ఆయన సోదరులు

భావన్నారాయణుని కల్యాణ వైభోగం

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని చారిత్రక నేపథ్యం కలిగిన శ్రీదేవి భూదేవి శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావన్నారాయణస్వామి కళ్యాణ వైభోగం బుధవారం రాత్రి కనులపండువగా జరిగింది. తొలుత ఉత్సవ కార్యక్రమాల్లో భాగంగా నిత్యార్చన, నిత్యహోమం, బలిహరణ పూజలు తదుపరి ఆధ్యాత్మిక సంప్రదాయ బద్ధంగా ఎదుర్కోలు ఉత్సవం భక్తజనుల ఆనందోత్సవాల నడుమ శాస్త్రోక్తంగా జరిపి అర్చకులు సందడి చేశారు. ఆలయ ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు, భోగాది వెంకట శేషగిరిరావు, భోగాది లోకేశ్వరరావు, భోగాది అప్పారాయుడు సతీ సమేతంగా పీటలపై కూర్చొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు పంచాగం రమణాచార్యులు, బ్రహ్మ కందూరి శ్రీనివాసాచార్యులు, వేద పండితులు నేతృత్వంలో కల్యాణం జరిపారు. గురువారం 3 వేల మంది భక్తులకు అన్నసంతర్పణ గావించారు. ఈ సందర్భంగా పండితులు రథంగ హోమం జరిపారు.

మల్లేశ్వరస్వామివార్ల కల్యాణోత్సవం

కొక్కిలిగడ్డ(మోపిదేవి): మండలంలోని కొక్కిలిగడ్డ గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామివార్ల కళ్యాణ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. శ్రీ మల్లేశ్వర స్వామివార్ల బ్రహ్మోత్సవాలు రెండోరోజు భక్తిశ్రద్ధలతో గుండెపూడి నాగరాజశేఖర శర్మ బ్రహ్మత్వంలో శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. అందులో బాగంగా గురువారం ఉదయం 8 గంటలకు నిత్యహోమం, ప్రభూతబలిహరణ, మంటప దేవతాహోమాలు, అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు శ్రీ గంగా భ్రమరాం సమేత శ్రీ మల్లేశ్వరస్వామివార్ల దివ్య కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం ప్రత్యేక వాహనంపై స్వామివార్ల గ్రామోత్సవం జరిగింది.

కమనీయం.. నాగేశ్వరస్వామి కల్యాణం


కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పేర్ని నాని దంపతులు, పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఖొజ్జిల్లిపేటలో వేం చేసి ఉన్న శ్రీ బాలత్రిపుర సుందరీ సమేత శ్రీ నాగేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం బుధవారం రాత్రి కనులపండువగా జరిగింది. వేద పండితులు బ్రహ్మశ్రీ రాళ్లపల్లి ఆంజనేయశాస్త్రి, ఘంటసాల భోగరాజశేఖరశర్మ, కె.భాస్కరచంద్రశేఖరశర్మ, ఆర్.చైతన్యకుమార్‌శర్మ నేతృత్వంలో వేద మంత్రోచ్ఛారణల నడుమ కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణంలో ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని)– జయసుధ దంపతులు పీటలపై కూర్చోగా, వారి కుమారుడు పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) సాంప్రదాయ దుస్తులను ధరించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజ షణ్ముఖం, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు.


మాధవస్వామి కల్యాణం



గూడూరు: గూడూరులో ప్రసిద్ధి చెందిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మాధవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణోత్సవం కనులపండువగా సాగింది. బుధవారం రాత్రి నిర్వహించిన కల్యాణోత్సవంలో భాగంగా ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కలపటపు నవరంగ్ కిషన్ పెండ్లి పీటలపై కూర్చుని స్వామి వారి దివ్య తిరు కల్యాణం జరిపించారు. ఆలయ అర్చకులు గంజాం సీతారామాచార్యులు వేదమంత్రాల మధ్య జరిగిన కళ్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. గురువారం స్వామి వారికి లక్షమల్లెల పూజా మహోత్సవం నిర్వహించారు.

ఘనంగా నాంచారమ్మ అమ్మవారి జాతర

కోడూరు: భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న మందపాకల అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం అమ్మవారి మూలమూర్తికి పూజలు చేసి ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్దారు. ముందుగా ముత్యాలమ్మ అమ్మవారి, అమ్మగారి తల్లి, అంకాలమ్మ అమ్మగార్ల జాతరను కనులపండువగా నిర్వహించారు. అనంతరం పోతురాజు స్వామివారి జాతరను కూడా భక్తిప్రపత్తులతో జరిపారు. యువకులు వీడతాడు, ఖడ్గాలతో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. విద్యుత్ ప్రభలను ఆలయం చుట్టూ తిప్పి భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. చిన్నారులపై శిరస్సు గండుదీపాలపై పెట్టి ఆలయం చుట్టూ తిప్పుతూ అమ్మవారి మొక్కుబడులు తీర్చుకున్నారు. జాతరను పురస్కరించుకొని ఆలయానికి ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. ప్రధానార్చకుడు కాశీభోట్ల శంకరశాస్త్రి భక్తులకు తీర్థప్రసాదాలు అందించగా, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త గాదె కృష్ణబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


ప్రత్యేక అలంకారంలో నాంచారమ్మ అమ్మవారు

సోదరుడి అదృశ్యంపై ఫిర్యాదు

పెడన: తన తమ్ముడు కనిపించడం లేదని అతని అన్నయ్య పెడన పోలీసులను ఆశ్రయించిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పెడన పట్టణం 18వ వార్డుకు చెందిన వీరంకి కొండబాబు(19) మానసిక వైకల్యం కలిగి ఉంటాడని, చాలా సార్లు బయటకు వెళ్లినా తిరిగి ఇంటికి వచ్చే వాడని చెప్పారు. బుధవారం బయటకు వెళ్లి ఇంటికి రాలేదని, చాలా చోట్ల వెతికినా ఫలితం లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కొండబాబు అన్నయ్య వీరంకి శశి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన అన్నమాచార్య కీర్తనలు

మచిలీపట్నంటౌన్: శ్రీ తాళ్లపాక అన్నమాచార్య 616వ జయంతోత్సవాలు గురువారం స్థానిక బుట్టాయిపేటలోని చిట్టి పిళ్లారయ్య ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. శ్రీ రామరత్న కళా వేదికపై పలువురు గాయనీ గాయకులు లయబద్ధంగా ఆలపించిన అన్నమాచార్యుని కీర్తనలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. నాదస్వరంపై ఆలపించిన కీర్తనలు ఆకట్టుకున్నాయి. సభికులు సాంప్రదాయ వస్త్రాలను ధరించి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు నిర్వాహకులు మాట్లాడుతూ పదకవితా పితామహుడు, తెలుగు ఆళ్వారు బిరుదులు పొందిన అన్నమాచార్యుడు శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని 32 వేల సంకీర్తనలతో అర్చించిన పరమ భాగవతోత్తముడని కొనియాడారు.

రుధిరవర్ణ గగనతలం

నాగాయలంక: వైశాఖ బుద్ధ పౌర్ణమి రోజున గురువారం సాయంత్రం 6.25 గంటలకు సూర్యాస్తమయ సమయాన నాగాయలంకలో కృష్ణానది పశ్చిమ తీరాన గగనతలం రుధిర కాంతులతో తైలవర్ణ చిత్రంలా సందర్శకులను మురిపించింది. రాత్రి 7.30 గంటల వేళ తూర్పు దిక్కున పసుపు కుంకుమ రంగులతో చంద్రుడు శోభాయమానంగా ఆవిష్కృతమయ్యాడు. సాయం సంధ్యవేళ పరస్పర ఎదురుగా రెండు దిక్కులు అగ్నిగోళంలా ఎరుపెక్కి కారుమబ్బుల సమ్మేళనంతో రుధిర వర్ణం సోయగం వెదజల్లినట్లు అచ్చెరువు కలిగించిన దృశ్యాలు ఇవి. పగటి విధులు ముగించుకుని పశ్చిమ తీరాన అస్తమిస్తున్న సూర్యుడు ఒకవైపు గూటికి చేరుకోగా సప్తవర్ణాల సమ్మేళనంగా కాన్వాస్‌పై చిత్రకారుడు అద్దిన అద్భుత చిత్రంగా ఆకాశంలో ఆవిష్కృతమై కనువిందు చేసింది. మరో వైపు పవిత్రంగా భావించే వైశాఖ బుద్ధ పౌర్ణమి చంద్రుడు సైతం ఉదయించే వేళ ఎరుపెక్కిన సూర్యకిరణాలకు పోటీగా బంగారు వర్ణంతో చిరు మేఘాల మాటున నాగాయలంక కృష్ణాతీర రామాలయం మీదుగా సొగసైన ప్రకృతికి దర్పణం పట్టింది. రెండు దిక్కులకు వేదికగా శ్రీరామపాదక్షేత్రం నుంచి ఈ దృశ్యాలను గురువారం సాయంత్రం, రాత్రి వేళల్లో సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.


అస్తమిస్తున్న సూర్యుడు


పౌర్ణమి చంద్రుడు ధగధగలు

ఐక్యతకు బుద్ధుని మార్గమే శరణ్యం

ఘంటసాల: కుల, మత వర్గాలకు అతీతంగా మానవులంతా ఐక్యంగా ఉండాలంటే గౌతమ బుద్ధుని మార్గమే శరణ్యమని ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన ఘంటసాలలో భంతే ధమ్మధజ థెరో ఆధ్వర్యంలో గౌతమ బుద్ధుని 2,568వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ భారతదేశంలో పుట్టిన ఏకైక మతం బౌద్ధమని, బుద్ధిజమే భారత రాజ్యాంగమని, రాజ్యాంగమే అంబేడ్కర్ అన్నారు. బుద్ధుని బోధనలు ఆదర్శంగా తీసుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారత రాజ్యాంగంలో ప్రజలకు హక్కులను కల్పించారన్నారు. బౌద్ధం విరాజిల్లిన ఘంటసాల పవిత్ర భూమి అని, పుణ్యాత్ముల నడిచిన ఈ నేల గొప్పదన్నారు. విజయవాడ నడిబొడ్డున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అంబేడ్కర్ విశిష్టత తెలిసే విధంగా 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, ఆ కార్యక్రమంలో తనతో పాటు బంతిజే పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఇంతటి మహాకార్యం చేపట్టిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ముందుగా ఘంటసాలలోని బౌద్ధ స్థూపం వద్ద, అమరావతి బుద్ధ విహార్‌లో బంతిజే ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భంతే ధమ్మధజ థెరో రచించిన ధమ్మ సంబోధి అనే కరపత్రాన్ని ఆవిష్కరించారు. 150 మందికి వస్త్రాలను పంపిణీ చేశారు. మాజీ ఉపసభాపతి డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, పీఏసీఏస్ మాజీ అధ్యక్షుడు బండి పరాత్పరరావు, ఉప సర్పంచ్ అయినపూడి భాను ప్రకాష్, బుద్ధిస్ట్ దాసి సీతారామరాజు, గొర్రెపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాగోలు(చల్లపల్లి): బుద్ధుని జయంతి వేడుకలు మహాబోధీ విహార్ ఆవరణలో ఘనంగా జరిగాయి. చోడాబత్తిన ఆదినారాయణ బుద్ధుని విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్, బంతిజే, బుద్ధప్రసాద్

ముగిసిన ఈఏపీసెట్

పెడన: మండలంలోని నందమూరు శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జరిగిన ఈఏపీసెట్ ఇంజినీరింగ్ స్ట్రీమింగ్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ బీఎస్ఎన్ రెడ్డి తెలిపారు. ఈ నెల 16న ప్రారంభమైన ఈఏపీసెట్ పరీక్షల్లో భాగంగా గురువారం ఎనిమిదో రోజుకు చేరాయన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 193 మందికి గాను 185 మంది హాజరయ్యారని, 8 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఎనిమిది రోజుల పాటు జరిగిన పరీక్షల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించామన్నారు.

చల్లపల్లి సందర్శించిన కేంద్ర బృందం


సంపద కేంద్రం వద్ద కేంద్ర బృందం ప్రతినిధులు

చల్లపల్లి: చెత్త నుంచి సంపద ఉత్పత్తిలో చల్లపల్లి ఆదర్శనీయంగా నిలుస్తోందని కేంద్ర బృందం ప్రతినిధులు ప్రశంసించారు. గురువారం సాయంత్రం చల్లపల్లి గ్రామాన్ని కేంద్ర ప్రభుత్వ సచివాలయం నుంచి ఐదుగురు ట్రైనీ ఐఏఎస్ అధికారులు విపుల్ పన్వర్, శశికాంత్ శర్మ, మయాంక్ కుమార్ సింగ్, పవన్ కుమార్ శర్మ, సుధాన్షు ఆనంద్ సందర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ పరిపాలన వ్యవస్థ పనితీరు పరిశీలన, విధులు, పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, సంపద తయారీ ప్రక్రియలను పరిశీలించారు. కేంద్రానికి సమర్పించాల్సిన నివేదికలకు అనుగుణంగా చల్లపల్లిలో అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉంగుటూరు, చల్లపల్లి ఈఓఆర్డీలు అమీర్ బాషా, బూరేపల్లి అశోక్, డీపీఆర్సీ సీనియర్ అసిస్టెంట్ చిన్నారావు, పంచాయతీ ఈవో పేర్ని మాధవేంద్రరావు, పారిశుద్ధ్య అధికారి సుధాకర్ పాల్గొన్నారు.

పవర్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు విజయవంతం

ఘంటసాల: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ఘంటసాల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పవర్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ప్రక్రియ విజయవంతమైందని చల్లపల్లి ఏడీఈ శివ నాగేశ్వరరావు తెలిపారు. విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజినీర్ కృష్ణానాయక్ ఆధ్వర్యంలో టీఆర్ఈ డీఈ రవి కిషోర్, ఏడీఈ విజయ్ కుమార్, చల్లపల్లి ఏడీఏ శివ నాగేశ్వరరావు పర్యవేక్షణలో విద్యుత్ శాఖ మండల ఏఈ రవికుమార్, సిబ్బంది విద్యుత్ సబ్ స్టేషన్‌లో పవర్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పనులను నిర్వహించారు. బుధవారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది సుమారు 17 గంటల పాటు శ్రమించి పవర్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ – 1 ఏర్పాటు చేసి విద్యుత్‌ను రీచార్జి చేయడంతో ప్రక్రియ విజయవంతమైంది. పనులు విజయవంతం కావడంపై అధికారులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. మరో పవర్ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఏఈ రవికుమార్ తెలిపారు.


ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన అధికారులు

ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలి

చిలకలపూడి(మచిలీపట్నం): సాధారణ ఎన్నికలకు సంబంధించి జూన్ 4వ తేదీన నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో ఏజెంట్లు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని బందరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.వాణి తెలిపారు. ఆమె కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించబడిన వారు ఈ నెల 30, 31వ తేదీల్లో మూడు ఫొటోలు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేయాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించబడిన వారు మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోనికి అనుమతించబడతారని స్పష్టం చేశారు. ఉదయం ఆరున్నర గంటలకు హాజరుకావాలని తెలిపారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్‌లను లెక్కించడం జరుగుతుందన్నారు. డీఎస్పీ ఎండీ అబ్దుల్ సుభాన్ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల మేరకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున లెక్కింపు రోజున ఎటువంటి ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదని తెలిపారు. నిబంధనలకు లోబడి రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నగర్ కన్వీనర్ షేక్ సలార్ దాదా, పలువురు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్‌కు సత్కారం

కోడూరు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో బందరు డివిజన్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన స్వతంత్రపురం జెడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థిని యర్రారెడ్డి ఉజ్వలను డీఈవో తాహెరా సుల్తానా సత్కరించారు. బందరులోని డీఈవో కార్యాలయంలో విద్యార్థి ఉజ్వలతో పాటు తల్లిదండ్రులను సత్కరించి, జ్ఞాపికను అందించారు. డీవైఈవో, ఎంఈఓలు, హెచ్ఎం పాల్గొన్నారు.


ఉజ్వలను సత్కరిస్తున్న డీఈవో తాహెరా సుల్తానా తదితరులు

క్లుప్తంగా

ముమ్మరంగా టీబీ వ్యాక్సినేషన్



కృత్తివెన్ను: టీబీ వ్యాధి నివారణలో భాగంగా ముందస్తుగా వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతున్నట్లు కృత్తివెన్ను పీహెచ్‌సీ వైద్యుడు సందీప్ తెలిపారు. గురువారం గ్రామాల్లో వ్యాక్సినేషన్‌ను నిర్వహించామన్నారు. ప్రతి గురువారం వ్యాక్సిన్ ప్రక్రియ జరుగుతుందని, మండల వ్యాప్తంగా కృత్తివెన్ను 480, లక్ష్మీపురం 510, చినపాండ్రాక 440 మూడు పీహెచ్‌సీల్లో కలిపి 1430 మందికి వ్యాక్సిన్ వేశామన్నారు. గత ఐదేళ్లలో టీబీ వచ్చి తగ్గిన వాళ్లు, 18 ఏళ్లు నిండిన వారు, పొగతాగేవారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, బీఎంఐ 18 కంటే తక్కువ ఉన్నవాళ్లు, టీబీ పేషెంట్స్‌తో దగ్గరగా ఉండేవాళ్లకు వ్యాక్సిన్ వేస్తున్నామన్నారు. టీబీ మందులు వాడుతున్న వాళ్లకు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, హెచ్ఐవీ, ఎయిడ్స్ ఉన్నవాళ్లు, జ్వరం, జలుబు, దగ్గు ఉన్నవాళ్లు, వ్యాక్సిన్ వేసినప్పుడు, రియాక్షన్ వచ్చిన వాళ్లకు, కిడ్నీ లేదా లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసుకుని మందులు వాడే వాళ్లకు ఈ వ్యాక్సిన్ వేయరాదని చెప్పారు.

ముగిసిన అగ్ని సువార్త స్వస్థత సభలు



మచిలీపట్నంటౌన్: మెస్సీయ హోలీఫైర్ మినిస్ట్రీస్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక హౌసింగ్ బోర్డు రింగ్ సమీపాన ఏర్పాటు చేసిన 7వ క్రీస్తు పరిశుద్ధ అగ్ని సువార్త స్వస్థత మహోత్సవాలు మూడో రోజైన గురువారంతో ముగిశాయి. కర్నూలుకు చెందిన పాస్టర్ ఫ్రెడ్డిపాల్, మెస్సీయ హోలీఫైర్ మినిస్ట్రీస్ నిర్వాహకుడు బ్రదర్ మధువిక్టర్‌పాల్‌లు దైవ వర్తమానాన్ని అందజేశారు. మానవుల పాపాలను క్షమించేందుకు ప్రభువైన ఏసుక్రీస్తు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని, అందువల్ల ఆయనపై పూర్తిగా విశ్వాసముంచి ప్రార్థిస్తూ క్రీస్తు బాటలో పయనిస్తే ఏ విషయంలోనూ కొదవు రాకుండా చూస్తాడని పేర్కొన్నారు. పలు రోగాల బారిన పడి సభలకు వచ్చిన రోగుల స్వస్థత కోసం ఫ్రెడ్డిపాల్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంగీత బృందం ఆలపించిన పలు క్రైస్తవ గీతాలు సభికులను అమితంగా ఆకట్టుకున్నాయి. ఈ సభలకు మచిలీపట్నం నగరంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి క్రైస్తవులు వేలాదిగా తరలివచ్చారు.

పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీకి సిద్ధం



మోపిదేవి: 2024–25 విద్యాసంవత్సరానికి విద్యార్థులకు అవసరమైన పాఠ్య, నోట్ పుస్తకాలు మండల విద్యా వనరుల కేంద్రంలో సిద్ధంగా ఉన్నాయని ఎంఈవో–2 కె.రాజీకుమార్ గురువారం తెలిపారు. 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు 10,605 టెస్ట్ బుక్స్ వచ్చాయన్నారు. 1 నుంచి 7వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 6,275 టెస్ట్ బుక్స్, 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు 15,652 నోట్స్ బుక్స్ సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలలు పునఃప్రారంభానికి ముందుగానే ఆయా పాఠశాలలకు పుస్తకాలు తరలిస్తామని ఎంఈవో చెప్పారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



శ్రీకాకుళం(ఘంటసాల): ఘంటసాల మండలం, శ్రీకాకుళంలో వేం చేసి ఉన్న శ్రీ రాజ్యలక్ష్మి, భోగలక్ష్మి సమేత శ్రీకాకుళేశ్వర స్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాట్య మయూరి, బాలమిత్ర అవార్డు గ్రహీతలు పాదర్తి యశస్విని, దివ్యశ్ర ఆధ్వర్యంలో పాదర్తి సిస్టర్స్ డ్యాన్స్ అకాడమీ శిష్య బృందంచే కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆయా కార్యక్రమాలను ఆలయ ఏసీ సూర్య చక్రధరరావు పర్యవేక్షించగా ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితుడికి రూ.లక్ష సహాయం

అవనిగడ్డ: గత నెలలో జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైన యాసం వెంకటేశ్వరరావు కుటుంబానికి ఎన్ఆర్ఐలు సమకూర్చిన లక్ష రూపాయల విరాళాన్ని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ అందించారు. కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.